కానిస్టేబుల్ సందీప్‌కు ఘన నివాళి



సందీప్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కీసర: చత్తీస్‌ఘడ్‌లో నక్సలైట్ల మందుపాతరకు ఘట్‌కేసర్‌కు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ మృతి చెందడం బాధాకరమని కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసరలో సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంచాల పెంటయ్య, నాయకులు కట్ట శంకరయ్య, గుర్రం శ్రీధర్‌రెడ్డి, బంటు శ్రీనివాస్, ఎర్ర సాయిలు, ఎంకిరాల నర్సింగ్‌రావు, తుడుం ఆగమయ్య, రాకేష్, సుమన్, శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీఆర్ కళాశాలలో ఆహారోత్సవ్



కేజీఆర్ కళాశాలలో ఆహారోత్సవ్ కార్యక్రమం

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో శుక్రవారం ఆహారోత్సవ్–2025 (ఫుడ్ ఫెస్టివల్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ కె.గోవిందరెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన వంటకాలు ఉన్నాయన్నారు. మనం పరస్పరం కలిసిమెలిసి రుచులను ఆస్వాదించడానికి, కొత్త వంటకాలను తెలుసుకునేందుకు, సాంప్రదాయాలను ఇతరులతో పంచుకోవడానికి ఈ ఆహారోత్సవ్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీ.రమణారావు, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ విజయలక్ష్మీ, డాక్టర్ శిల్పిక, స్రవంతి, నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

మేడ్చల్: రైతులకు అధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మేడ్చల్, రాయిలాపూర్, అక్బర్జాపేట్, గుండ్ల పోచంపల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులు ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి పర్యటించారు .రైతు వేదికల వద్ద, పొలాల వద్ద రైతులతో శాస్త్రవేత్తలు ,అధికారులు సమావేశమై చీడీ పీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యాన పంటలపై తీసుకోవాల్సిన మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వర్ణలత, సౌమ్య, వసంత, పరుశరాం, శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నాయకులు

పోచారం: మున్సిపల్ కార్మికుల వేతనాన్ని రూ. 26,400కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని నోటీసులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు చింతల యాదయ్య, సబిత, అశోక్, దాసు, బిక్షపతి, కృష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉప్పల్: వడ దెబ్బ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(40)ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిని మింగేస్తూ..

నీటిని తోడేస్తూ..!



కొనాయిపల్లిలో మట్టి మాఫియా తవ్విన గుంతలు

సొమ్ము చేసుకుంటున్న మాఫియా

- అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు
- పొలాల వద్ద సంపులు ఏర్పాటు చేసి నీటి తరలింపు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మేడ్చల్: కొంతమంది అవసరాలను ఆసరా చేసుకుని వ్యాపారులు భూమాతకు తీవ్ర గర్భశోకం మిగిలిస్తున్నారు. ఒక వైపు సారవంతమైన నేలలో పెద్ద పెద్ద గుంతలు.. మరో వైపు భూగర్భంలో ఉన్న నీటిని అక్రమంగా తోడేస్తున్నారు. నగర శివార్లలో ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో మట్టి దందా, నీటి దందా జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో నిర్మాణ రంగం జోరుగా ఉండటంతో కట్టడాలలో మట్టి నింపడానికి, గోదాంలలో మట్టి నింపడానికి వేల టన్నుల మట్టి అవసరం ఉండటంతో మట్టి దందా చేసే వ్యాపారులు వృధాగా ఉన్న భూములు కనబడితే చాలు వాటిల్లో క్వారీలు ఏర్పాటు చేసి భూతల్లికి చెరబట్టి అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు.

ప్రభుత్వ,అసైన్డ్ భూములే టార్గెట్...

అసైన్డ్, ప్రభుత్వ భూములను మట్టి మాఫియా టార్గెట్ చేసుకుని లక్షల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు, గ్రామాల రాజకీయ నేతల అండదండలతో చెలరేగిపోతున్నారు. మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్, కోనాయిపల్లి, శ్రీరంగవరం, రావల్ కోల్, బండమాదారం, గుండ్లపోచంపల్లి, మైసిరెడ్డి పల్లి, రాజబోల్లారం గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో రోజురోజుకు మట్టి మాఫియా పేట్రేగిపోతోంది.



మేడ్చల్ లో నీటిని తరలిస్తున్న ట్యాంకర్లు

సెలవు రోజులు.. రాత్రి సమయాల్లో జోరుగా...

అక్రమ దందా చేస్తున్న వ్యాపారులు రాత్రి సమయాల్లో, వారంతపు రోజులు, సెలవు రోజుల్లో రెచ్చిపోతున్నారు.అధికారులకు తెలియొద్దనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో అక్రమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. రాత్రి పూట పదుల సంఖ్యలో టిప్పర్లు ఏర్పాటు చేసి హిటాచీలు, జేసీబీల సహాయంతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రిపూట క్వారీల వద్ద గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకుని అక్కడే తెల్లవార్లు ఉంటూ మద్యం సేవిస్తూ ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిని భయాభ్రాంతులకు గురి చేస్తున్నారు.

అక్రమంగా నీటి చౌర్యం..

వేసవిలో మేడ్చల్ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో పట్టణాలు ఉన్న ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడింది. బోర్లు నీరు పోయకుండా మొండికేయడంతో మంచినీరు సరఫరా చేసే ట్యాంకర్ వ్యాపారులకు గిరాకీ పెరిగింది. దీంతో వ్యాపారులు, కొంతమంది రైతులు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. నీటిని ఎక్కడి నుంచి తెస్తున్నారు... ఎక్కడకి తరలిస్తున్నారు.? వంటి వివరాలతో పాటు లీటర్ నీటికి ఇంత పన్ను చొప్పున చెల్లించాలని జిల్లా అధికారుల ఆదేశాలు ఉన్నా వాటిని ఎవరూ ఖాతరు చేయడం లేదు. చెరువు ఒడ్డున, పొలాల్లో సాగు కోసం వేసిన బోర్ల నుంచి నీటిని తరలిస్తున్నారు.

- ఉచిత కరెంట్‌తో బోర్లు నడుస్తుంటడంతో కొంత మంది రైతులు బోర్లను సాగు కోసం కాకుండా వ్యాపారం కోసం వినియోగిస్తున్నారు. పొలాల వద్ద ఉన్న బోర్ల వద్ద సంపులు ఏర్పాటు చేసి నీటిని అమ్ముకుంటున్నారు. రైతులు ముసుగుతో అక్రమ వ్యాపారాలు నడిపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని కమర్షియల్ వ్యాపారాలకు వినియోగిస్తూ ఉచిత కరెంట్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. మేడ్చల్ ప్రాంతంలో అక్రమార్కులు అవసరాలను ఆసరా చేసుకుని ప్రకృతితో ఆటలాడుతూ భూతల్లికి తీవ్ర శోకంను మిగిలిస్తు తమ జేబులు నింపుకుంటున్నారు. అక్రమ వ్యాపారులపై అధికారులు కోరడా జిలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నైబర్‌హుడ్, లక్ష్మీనగర్, ఊర్జిత 1,2,3, ట్రినెంట్ ,ఏజీ సైట్, మాణిక్యరెడ్డి నగర్, అపర్ణ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

కొనసాగుతున్న భూ భారతి సదస్సులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కీసర: భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం భోగారం, నాగారం, అహ్మద్‌గూడ గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగారంలో 88 , నాగారంలో 37, అహ్మద్‌గూడలో 5లో దరఖాస్తులు అందినట్లు కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు విస్తరణను తగ్గించాలి



గ్రామసభకు హాజరైన ప్రజలు

శామీర్‌పేట్: రోడ్డు విస్తరణను తగ్గించాలని రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న బాధితులు అధికారులను వేడుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూసేకరణ లో భాగంగా శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీలో పునరావాస, ఉపాధి కల్పనకు అధికారులు గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ హరిప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణలో నివాసాలు, భూములు, కమర్షియల్ భవనాలు కోల్పోతున్నవారు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ... నగరంలోని ప్యారడైజ్ నుండి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై భూసేకరణపై అధికారులు మరోసారి ఆలోచించాలన్నారు. 200 ఫీట్ల రోడ్డు వెడల్పును 100 ఫీట్లకు తగ్గించాలని మార్కెట్ ధర ప్రకారమే నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. గతంలో పలుమార్లు సభలు పెట్టారని, తాము అడిగిన సందేహాలకు అధికారులు జవాబు ఇవ్వడం లేదన్నారు. అనంతరం బాధితులు అడిగిన సందేహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వివరించారు.

రైతులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు

శామీర్‌పేట్: ధాన్యాన్ని కొనుగోల కేంద్రాలకు తరలించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ హరిప్రియ అన్నారు. శుక్రవారం ఆమె శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి సహకరించాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాలోకి నగదు జమ చేస్తామన్నారు. కేంద్రాలకు వచ్చిన రైతులకు తాగు నీరు ఏర్పాటు చేయాలని, హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అలియాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు



అల్వాల్ బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కుషాయిగూడ: పాకిస్థాన్ ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ శుక్రవారం కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వుప్పల యాదగిరిరెడ్డి, ఈఓ వీరేశం, అర్చకులు రమణ పంతులు, వేణు పంతులు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని కోరుతూ అల్వాల్ లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని వారు విజయంతో నిలవాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

అల్వాల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వెంకటాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన విధంగా బుద్ధి చెప్పే అవకాశం భారత సైన్యానికి వచ్చిందన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, యాదగిరి, సూర్య కిరణ్, దేవేందర్, రఘు, భాస్కర్, నాగేశ్వరరావు, రాజసింహారెడ్డి, లక్ష్మణ్ , సంతోష్ రెడ్డి ,వీనస్ మేరీ, బబిత , శకుంతల నాయుడు, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానవత్వం చాటుకున్న ఎంపీ ఈటల



పరామర్శిస్తున్న ఎంపీ ఈటల

శామీర్‌పేట్: రోడ్డుపై గాయాలతో పడి ఉన్న వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి ఎంపీ ఈటల మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం సాయంత్రం తన కార్యక్రమాలను ముగించుకొని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో శామీర్‌పేటలోని తన నివాసానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బైక్‌పై నుంచి కిందపడి ఉండటాన్ని గుర్తించిన ఆయన వాహనాన్ని ఆపి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108లో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సర్వీస్ రోడ్డులో వీధి దీపాలు లేక ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

కుషాయిగూడ: కుషాయిగూడ గ్రామంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె కుషాయిగూడ బస్టాండ్ బోర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుషాయిగూడ గ్రామ అవసరాలతో పాటు, హనుమాన్ విగ్రహ నిర్మాణానికి, శ్మశానవాటికకు అవసరమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో బోరు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చల్ల ప్రభాకర్, స్థానికులు బత్తుల శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చెరువు కట్టపై నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనులు పూర్తయితే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్ రెడ్డి, ఆదిత్య, పాపిరెడ్డి, శ్యామ్, శర్మ, ఆకారం సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

మేడిపల్లి: మేడిపల్లి మండల లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల కేశవ నాధం గౌడ్ ఆధ్వర్యంలో తల్లం ప్రణయ్ పుట్టినరోజు సందర్భంగా డిలైట్ చారిటబుల్ ట్రస్ట్‌కు శుక్రవారం బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో లయన్ వేముల నాధం గౌడ్, అధ్యక్షుడు పల్లె బాల్ రాజ్ గౌడ్, మహేందర్ రావు, లయన్ శారద,సావిత్రి,రవీందర్ రెడ్డి,ప్రభాకర్,సందీప్, క్రిష్ణ స్వామి, ఫౌండర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమాగౌరి

మేడ్చల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి (డీఎం అండ్ హెచ్‌ఓ) డాక్టర్ ఉమాగౌరి, జిల్లా హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీత అన్నారు. శుక్రవారం వారు మేడ్చల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సేవల పెరుగుదల, తక్కువ సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, గర్భిణులకు మెరుగైన వైద్యం, పిల్లలకు టీకాలు తదితర కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది సేవా భావంతో పని చేయాలరు. జిల్లాలో ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్యానికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న మౌలాలి కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్

మౌలాలి : పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ త్రివిధ దళాలతో పాటు కేంద్ర ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మీడియాతో మాట్లాడుతూ తరచూ దాడులకు తెగబడుతున్న పాకిస్తాన్‌కు సరైన రీతిలో బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచ పటంపై నుంచి చెరిపివేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. ఇటువంటి విపత్కర సమయంలో దేశ ప్రజలంతా ఒక్క తాటిపై నిలబడి సరిహద్దులో పోరాడుతున్న సైన్యంలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీష్‌యాదవ్, శివగౌడ్, వెంకటేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి కన్నీటి వీడ్కోలు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు



ఉప్పల్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బండారి రాజి రెడ్డి పార్థివ దేహాన్ని శుక్రవారం పలువురు రాజకీయ నేతలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున సందర్శించి నివాళులర్పించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి, మాజీ రాజ్య సభ సభ్యులు కేవీపీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ తదితరులు రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి ఘన నివాళి

కుషాయిగూడ: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతికి పలువురు నివాళులు అర్పించారు. శుక్రవారం ఆయన అంతిమ యాత్ర హెచ్‌బీకాలనీ, ఈసీఐఎల్, చక్రీపురం మీదుగా సాగింది. దారిపొడవునా ఆయన అభిమానులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

ముంపు సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కి వినతిపత్రం అందజేస్తున్న కమలాలయ కాలనీవాసులు

అల్వాల్: వర్షం కురిసిన ప్రతిసారి కాలనీ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో మస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమలాలయ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం డివిజన్ పరిధిలోని కమలాలయ కాలనీలో వరద నీటి కాలువ నిర్మాణం లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి కాలనీ ముంపునకు గురవుతుందన్నారు. బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్ కాలనీవాసులు వినోద్ కుమార్, శర్మ తదితరులు ఉన్నారు.